## క్లుప్తంగా

### పోలింగ్ కేంద్రాల పరిశీలన



దాచేపల్లి: మండలంలోని కేసానుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ జి.కరుణకుమార్ శనివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లోని వసతులపై బీఎల్వోలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బీఎల్వోలతో తహసీల్దార్ కరుణకుమార్ మాట్లాడారు. ఓటర్ల జాబితాలో డెత్‌లను తొలగించాలని, అర్హత ఉంటే ఓటు హక్కు కల్పించాలని ఆయన చెప్పారు. ఎన్నికల బాధ్యతలను సమర్థవతంగా నిర్వహించాలని సూచించారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ శరత్‌కుమార్, వీఆర్వోలు వెంకటగిరి, మణికుమార్ ఉన్నారు.

### మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలుచేయాలి

రెంటచింతల: మండలంలోని వివిధ పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని హెచ్ఎంలు సక్రమంగా అమలు చేయాలని ఎంఈఓ-1 వేముల నాగయ్య తెలిపారు. శనివారం స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన పథకం రికార్డులను, విద్యార్థులకు ఏర్పాటు చేసిన భోజనాన్ని పరిశీలించి మాట్లాడారు. ప్రతి రోజు మధ్యాహ్న భోజన పథకం వివరాలను రికార్డులలో ఖచ్చింగా నమోదు చేయాలన్నారు. రఫ్‌గా వివరాలను నమోదు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఉపాధ్యాయుల సంఖ్యను బట్టి రోజుకు ఇద్దరు, ముగ్గురు చొప్పున వంతుల వారీగా ఉపాధ్యాయులకు మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ బాధ్యతలు కేటాయించాలని సూచించినట్లు తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వం అమలుచేస్తున్న మెనూ ప్రకారం భోజన ఏర్పాట్లు చేయాలని, విద్యార్థుల నుంచి మెనూ నిమిత్తం ఫిర్యాదులు వస్తే, ఆ పాఠశాలల హెచ్ఎంలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉంటుందన్నారు.

### గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం

రెంటచింతల: మండలంలోని మల్లవరం గ్రామ శివార్లలోని ఓ పంటపొలంలో ఓ గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభించినట్లు ఎస్ఐ సామేల్ రాజీవ్‌కుమార్ శనివారం తెలిపారు. మల్లవరం గ్రామం నుంచి కొత్తగం గరాజుపల్లె గ్రామానికి వెళ్లేదారిలోని గురుస్వామి పంటపొలంలో ఓ గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం ఉన్నట్లు ఆ గ్రామానికి చెందిన యువకుడు సమాచారం ఇచ్చాడన్నారు. వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని పంచనామా నిమిత్తం గురజాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. వృద్ధురాలికి సుమారు 60 సంవత్సరాలు ఉండవచ్చని వివరాలకు రెంటచింతల పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### చికిత్స పొందుతూ యువకుడు మృతి

వినుకొండ టౌన్: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి యత్నించిన మృతి చెందినట్లు పట్టణ ఎస్ఐ డి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. పట్టణ శివారులోని కోటప్ప నగర్‌లో నివాసం ఉంటున్న మక్కెళ్ల రమేష్ (21) అప్పుల బాధ తాళలేక బుధవారం పురుగు మందు తాగాడు. అయితే భర్త వాంతులు చేసుకొంటుండగా భార్య నాగమణి గమనించింది. చికిత్స నిమిత్తం వెంటనే పట్టణంలోని ఓ ప్రవేట్ వైద్యశాల (బాలాజీ నర్సింగ్ హోం)కు తీసుకురాగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తీసుకు వెళ్లమని వైద్యులు సూచించారు. అయితే అక్క డ చికిత్స పొందుతూ రమేష్ శుక్రవారం రాత్రి మరణించాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### అనుమానాస్పదంగా వినుకొండవాసి మృతి

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం మారెళ్లవారిపాలెం గ్రామ సమీపంలో వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన వ్యక్తి మృతదేహాన్ని ఐనవోలు పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఐనవోలు ఎస్సై అనీల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం వినుకొండ పట్టణం అంబేద్కర్ నగర్‌కు చెందిన పులి ఏడుకొండలు (25) మారెళ్లవారిపాలెం, ఈదర ప్రధాన రహదారిపై మృతదేహం తలలేకుండా రోడ్డుపై పడి ఉండటంతో స్థానికులు సమాచారం మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని వినుకొండ ప్రభుత్వం వైద్యశాలలోని మార్చురికి తరలించారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు కేబీఆర్ కళాశాల విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు కాసు బ్రహ్మానందరెడ్డి జూనియర్ కళాశాలకు చెందిన ఇరువురు విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్.వి.నాగిరెడ్డి శనివారం తెలిపారు. తమ విద్యార్థులు ఎం.జాన్‌రెడ్డి అండర్-17 క్రికెట్ పోటీకి, షేక్.రోహన్ జాన్మర్ అథ్లెటిక్ (డిస్కస్ త్రో) విభాగానికి ఎంపికైనట్టు వివరించారు. త్వరలో పట్టణంలోని డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలలో తమ విద్యార్థులు ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

# దూబ చెరువుకు మహర్దశ

- మారిన రూపురేఖలు
- చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, గ్రీనరీ, విద్యుత్ వెలుగులు
- సుమారు రూ.2కోట్లతో ఆధునికీకరణ
- త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు



చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్. గ్రీనరీ



ఎంట్రన్స్ గేటు

గురజాల: నగర పంచాయతీ ప్రజలకు మంచినీటిని అందించే దూబచెరువు రూపు రేఖలు పూర్తిగా మారిపోతున్నాయి. గురజాల పట్టణ వాసులకు దూబచెరువు నీరే ఆధారం. సుమారుగా గత 400 సంవత్సరాలకు పైబడి దూబచెరువు నుంచి మంచి నీటిని ప్రజలు వాడుకుంటున్నారు. అయితే గత పాలకుల నిర్లక్ష్యం మూలాన చెరువు అభివృద్ధికి నోచుకోలేదు. గత ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రచారంలో భాగంగా దూబచెరువును సందర్శించారు. అందులో పశువులు, పందులు, సంచరిస్తూ దర్శనమిచ్చాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో గెలుపొందిన వెంటనే దూబచెరువును తప్పనిసరిగా ఆధునికీకరణ చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీల్లో భాగంగా సుమారుగా రూ.2కోట్ల నిధులు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మంజూరు చేశారు. వాకింగ్ ట్రాక్, గ్రీనరీ, విద్యుత్ దీపాలతో అలంకరణ వంటి పనులు చేపట్టారు. అదేవిధంగా ఈ నిధుల ద్వారానే పిల్లలు ఆడుకునేందుకు పార్కు, చెరువు చుట్టూ ఫెన్సింగ్, ఓపెన్ జిమ్ వంటి సౌకర్యాలు కల్పించేందుకు ఎమ్మెల్యే కాసు ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే చెరువు చుట్టూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే విధంగా చర్యలు చేపడుతున్నారు.

**చుట్టూ ఫెన్సింగ్..**

దూబచెరువు చూట్టు ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. దూబ చెరువులోకి పశువులు వెళ్లకుండా రాత్రివేళ అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించేందుకు వీలులేకుండా చర్యలు చేపడుతున్నారు. చుట్టూ ప్రహరీ నిర్మాణానికి ఇప్పటికే 60 శాతం మేరకు పనులు పూర్తయ్యాయి. త్వరలో చిన్నారులకు పార్కుతో పాటు ఓపెన్ జిమ్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి దూబ చెరువుపై ప్రత్యేక దృష్టి సారించగా, నగర పంచాయతీ చైర్ పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి ఆధ్వర్యంలో సుందరవనంగా తీర్చి దిద్దుతున్నారు.

### ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతోనే..



నగర పంచాయతీకి అప్‌గ్రేడ్ అయి మొదటి పాలక వర్గంగా మా మార్కు చూపించాలనే ఆలోచనతో దూబ చెరువు ఆధునికీకరణ పనులు చేపట్టడం జరుగుతుంది. ఇప్పటికే 80 శాతంకు పైగా పనులు పూర్తయ్యాయి. చెరువు చూట్టు వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటుచేసి లైటింగ్, మొక్కలు పెంపకం వంటి పనులు చేపట్టాం. ఈ నెలలోనే పిల్లల పార్కు, జిమ్, చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రత్యేక చొరవతోనే దూబచెరువు అభివృద్ధి శరవేగంగా జరుగుతోంది.

– పోలు పవన్మయి వీరారెడ్డి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ గురజాల

# సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటాం

**ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి**



ఎండిన మిరప మొక్కలు పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

దాచేపల్లి: పంటలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని కేసానుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో పత్తి, మిరప పంటలను శనివారం ఆయన పరిశీలించారు. సాగునీరు అందక ఎండిన పంటలను ఎమ్మెల్సీ జంగా పరిశీలన చేసి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వంతో మాట్లాడి పంటలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు ఎమ్మెల్సీ జంగాను కోరారు. రైతులు అధైర్యపడవద్దని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబుతో మాట్లాడి రైతులు పండిస్తున్న పంటలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్సీ జంగా చెప్పారు. వర్షపాతం చాలా తక్కువగా నమోదు కావటం వలన నాగార్జునసాగర్ ప్రాజెక్ట్‌లో నీటినిల్వలు తగ్గాయని, పల్నాడు ప్రాంతంలో రైతులు పండిస్తున్న పంటలు ఎండిపోతుండటం వలన సాగునీరు విడుదల చేసేలా ప్రయత్నాలు చేస్తానని ఆయన తెలిపారు. పంటల సాగులో రైతులు పడుతున్న ఇబ్బందులను తాను స్వయంగా గమనించానని, రైతు పక్షపాత ప్రభుత్వం సాగునీరు తప్పక అందిస్తుందని ఆయన రైతులకు భరోసా ఇచ్చారు. రైతులకు ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ జంగా వెంట సర్పంచ్ వినుకొండ కోటేశ్వరరావు, ఎంపీటీసీ చెట్టిపోగు ఏసుదాసు, మానిటరింగ్ కమిటీ సభ్యుడు గద్దల వేదమణి, ఎంపీటీసీ మాజీ సభ్యులు జక్కుల వీరాస్వామి, జక్కా అనంతరామయ్య, నాయకులు బొల్లా శ్రీనివాసరావు, చుండు రామారావు, నెల్లూరి కోటేశ్వరరావు, వినుకొండ చిన్నజాను, జక్కుల రమేష్, బంబోతుల శ్రీనివాసరావు, చెట్టిపాగు పాపయ్య, మీసాల రవికుమార్ తదితరులున్నారు.

# మండలాభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం

**ఎంపీపీ చింతా శివరామయ్య**



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చింతా శివరామయ్య

వెల్దుర్తి: మండలాన్ని అన్నిరంగాల్లో సమష్టిగా కృషి చేద్దామని ఎంపీపీ చింతా శివరామయ్య అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలలో ఉన్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తున్నారన్నారు. ఇటీవల జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 4478 మందికి వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి, మందులు అందించడం జరిగిందన్నారు. బంగారుతల్లి కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 10 నుంచి 19సంవత్సరాల వయసు గల విద్యార్థినులను వివిధ పాఠశాలల్లో చదువుతున్న 2014 మందికి రక్త పరీక్షలు నిర్వహించి రక్తహీనత ఉన్నవారికి ఐరన్ టాబ్లెట్లు అందిస్తున్నారన్నారు. గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు అంచనాలు రూపొందించి పని అడిగిన ప్రతి ఒక్కరికీ పని ఇచ్చేలా సిద్ధంగా ఉండాలన్నారు. గ్రామాలలో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో వివిధ శాఖల భవనాలు నిర్మించేందుకు రూ. 15కోట్లు ఖర్చు చేశామన్నారు. ఇటీవల శిరిగిరిపాడులో రెండు బోరు బావులు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. మాచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పల్లపాటి గురుబ్రహ్మం, జెడ్పీటీసీ సభ్యుడు రూప్లీబాలు నాయక్, తహసీల్దార్ కోటేశ్వరరావు నాయక్, ఎంపీడీఓ డి.ప్రసాద్, పీఆర్‌డీఈ పాశం శ్రీనివాసరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాబునాయక్, ఏఓ పుల్లారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధి చూసి ఓర్వలేకపోతున్నారు

- పిడుగురాళ్లను రూ.900 కోట్లతో అభివృద్ధి చేశాం
- టీడీపీ నేత యరపతినేనికి అభివృద్ధి పదానికి అర్థమే తెలియదు
- గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



పిడుగురాళ్ల: తాము చేసిన అభివృద్ధిని చూసి తెలుగు దేశం పార్టీ నాయకులు ఓర్వ లేకపోతున్నారని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జీవితంలో యరపతినేని శ్రీనివాసరావు ఎప్పుడూ అభివృద్ధి మాటే ఎత్తలేదన్నారు. యరపతినేని జీవితంలో పిడుగురాళ్ల పట్టణంలో ఒక ఇంటికి మంచినీరు ఇవ్వలేదని, ఒక హాస్పటల్ నిర్మించలేదని ఆయన విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో పిడుగురాళ్ల పట్టణాన్ని రూ.900 కోట్లతో శాశ్వత పథకాలు, నవరత్నాలు కాకుండా అభివృద్ధి చేస్తున్నామన్నారు. మెడికల్ కాలేజీ నిర్మాణం, హాస్పటల్స్, స్కూల్స్ ఇలా విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యమిచ్చి అభివృద్ధి చేశామన్నారు. రూ.100 కోట్లతో 75 సంవత్సరాల తర్వాత పిడుగురాళ్ల మున్సిపాలిటీకి తాగునీటిని తీసుకొని వచ్చామన్నారు. ఇప్పటికే 10 వేల కనెక్షన్లు ఇవ్వటం జరిగిందని, త్వరలోనే మరో 7,8 వేల కనెక్షన్లు ఇవ్వటం జరుగుతుందని ఆయన తెలియజేశారు. పిడుగురాళ్ల పట్టణంలోని ప్రధాన రహదారి అంతా వెడల్పు చేయటం జరిగిందన్నారు. గత 18 సంవత్సరాలుగా మున్సిపల్ కార్యాలయానికి ఒక్క బిల్డింగ్ లేదని, మున్సిపాలిటీ బిల్డింగ్‌కు రూ.కోటిన్నర, రహదారి కోసం రూ.5, 6 కోట్లు లోనుగా తీసుకోవటం జరుగుతుందన్నారు. ఆర్థిక పరిస్థితి బాగోలేని కారణంగానే లోను తీసుకోవటం జరుగుతుందని దానిని కూడా విపక్షాలు రాజకీయం చేస్తున్నారని అన్నారు. రూ.900 కోట్లతో అభివృద్ధి చేసిన వారికి రూ.5,6 కోట్లు రుణం తీసుకోవటం సరైనది కాదా అని ప్రశ్నించారు. లోను రికవరీకి కూడా నిధులు సమకూర్చే విధానాన్ని ప్రభుత్వానికి చూపించటం జరిగిందన్నారు. ఇంటింటికి దాదాపు 15 వేల కనెక్షన్లు ఇవ్వటం జరుగుతుందని, ప్రతి ఇంటి నుంచి రూ.100 వసూలు చేయటం ద్వారా రూ. 15 లక్షలు, సుమారు రూ.1.50 కోట్లు అదనంగా రావటం జరుగుతుందని, జనరల్ ఫండ్ టీడీపీ హయంలో రూ.4 కోట్లు వస్తే, కానీ ఇప్పుడు రూ.7 కోట్లు వస్తుందన్నారు. మరో రూ.2 కోట్లు అదనంగా వస్తుందన్నారు. రుణం తీసుకున్నా వాటిని రెండు, మూడేళ్లల్లో తీర్చుకోవచ్చునని తెలిపారు. టీడీపీ నేతలు విమర్శించడమే పనిగా పెట్టుకోగా, తాము అభివృద్ధిపై దృష్టి పెట్టామన్నారు.

# చిరు ధాన్యాలతో ఆరోగ్య ప్రయోజనాలు



బహుమతి ప్రదానం చేస్తున్న శాస్త్రవేత్త దీప, వైఎస్సార్ సీపీ నాయకుడు లాజర్

కారెంపూడి: చిరుధాన్యాలను అనుదిన ఆహారంలో భాగంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్య ప్రయోజనాలు పుష్కలంగా చేకూరుతాయని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.దీప పేర్కొన్నారు. మండలంలోని ఒప్పిచర్ల గ్రామ సచివాలయం-1 పరిధిలోని మహిళలకు చిరు ధాన్యాల వంటకాల పోటీలను కృషి విజ్ఞాన కేంద్రం, శ్రీ వేంకటేశ్వర పశు వైద్య విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించారు. మిల్లెట్స్‌తో మహిళలు వివిధ రకాల వంటకాలు తయారు చేసి ప్రదర్శించారు. అనంతరం మిల్లెట్స్‌తో వంట బాగా చేసిన మహిళలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఇరికెదిండ్ల రమణకొండలు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ గ్రామ నాయకుడు ఇరికెదిండ్ల లాజర్ మాట్లాడుతూ ఒకప్పుడు పేదల ఆహారంగా ఉన్న రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు లాంటి చిరుధాన్యాలు నేడు ధనవంతుల ఆహారమయ్యాయని పేర్కొన్నారు. వీటిలో పుష్కలంగా ఉన్న ఆరోగ్య ప్రయోజనాల వల్లే వీటిని తింటున్నారని జగనన్న ప్రభుత్వం కూడా వీటి సాగును ప్రోత్సహిస్తోందన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ మిల్లెట్స్ వంటకాలు చేసి అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా అందించడం వల్ల బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతున్నాయని ప్రత్యక్షంగా గమనించడం జరిగిందన్నారు. యానిమేటర్లు, గ్రామ వలంటీర్లు, మహిళలు పాల్గొన్నారు.

# ఓట్ల ప్రక్రియపై అప్రమత్తంగా వ్యవహరించండి

**బీఎల్ఓలకు సూచనలు చేసిన డీఆర్ఓ కె.వినాయకం**



దుర్గిలో ఓటర్ల ప్రక్రియ సరళి గురించి మాట్లాడుతున్న డీఆర్ఓ కె.వినాయకం

దుర్గి: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శని, ఆదివారాలు పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్, డీఆర్ఓ కె.వినాయకం అన్నారు. శనివారం మండల కేంద్రమైన దుర్గిలో 167 నుంచి 173 పోలింగ్ బూత్‌వరకు నిర్వహిస్తున్న ఓటింగ్ ప్రక్రియ గురించి స్థానిక బీఎల్ఓలను వివరాలడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి అలసత్వం ప్రదర్శించకుండా పకడ్బందీగా ముసాయిదా జాబితాను పరిశీలించాలన్నారు. ప్రత్యేక శిబిరాలలో 18సంవత్సరాలు నిండిన వ్యక్తికి ఫారం-6 ద్వారా కొత్త ఓటు నమోదును చేపట్టాలన్నారు. ముఖ్యంగా చనిపోయినవారి వివరాలను పూర్తిగా క్షేత్రస్థాయిలో విచారించి తొలగించాలన్నారు. డబుల్ ఎంట్రీలు ఉంటే సంబంధిత రాజకీయ పార్టీల ఏజెంట్లు తమ దృష్టికి తీసుకొచ్చి బూత్‌లెవల్ ఆఫీసర్లకు వివరాలందించాలని కోరారు. బీఎల్ఓలకు పలు సూచనలు అందించారు. ప్రక్రియ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.

### అర్హులందరినీ ఓటర్లుగా చేర్చాలి

గురజాల: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించే విధంగా చూడాలని నగర పంచాయతీ కమిషనర్ అన్నదాత మోహన శ్రీనివాస్ సూచించారు. పోలింగ్ బూత్‌ల వద్ద శనివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, బూత్‌లెవల్ అధికారులు అందుబాటులో ఉన్నారా లేదా అనే విషయాన్ని పరిశీలించారు. అనంతరం ఓట్లపై ఏమైనా ఫిర్యాదులు వస్తే వారి వద్దనుంచి అర్జీలను స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఆదివారం కూడా బూత్‌లెవల్ అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటారన్నారు.

# డాక్టర్ బాషాకు ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పురస్కారం



డాక్టర్ బాషాను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ వైఎస్ఎస్ చౌదరి

విజయపురిసౌత్: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రతి సంవత్సరం బహూకరించే ఉత్తమ ప్రోగ్రాం ఆఫీసర్లను ఈ సంవత్సరం కూడా నిర్ణయించడం జరిగింది. దీనిలో భాగంగా గుంటూరు, బాపట్ల, ప్రకాశం, పల్నాడు జిల్లాలలో ప్రతిభ చాటిన ప్రోగ్రాం ఆఫీసర్లను ఉత్తమ ప్రోగాం ఆఫీసర్లుగా నిర్ణయించారు. పల్నాడు జిల్లానుంచి ఆంధ్రప్రదేశ్ గురుకుల డిగ్రీ కళాశాల చెందిన డాక్టర్ షేక్ మహమ్మద్ బాషాను ఉత్తమ ప్రోగ్రాం ఆఫీసర్‌గా ధ్రువీకరించారు. ఈ సందర్భంగా శనివారం కళాశాల ప్రిన్సిపాల్ వైఎస్ఎస్ చౌదరి మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు సామాజిక బాధ్యత ఎంతో ముఖ్యమని, వారిలో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఎన్ఎస్ఎస్ ఎంతో తోడ్పడుతుందన్నారు. పల్నాడు జిల్లా నుంచి డాక్టర్ బాషాను ఉత్తమ ప్రోగ్రాం ఆఫీసర్‌గా ఎన్నుకున్నందుకు ఆచార్య నాగార్జున సిటీ వైస్ చాన్సలర్‌కు, ఎన్ఎస్ఎల్ కో-ఆర్డినేటర్‌కు ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు. నాగార్జున యూనివర్సిటీ బహూకరించినటువంటి షీల్డ్, సర్టిఫికేట్, మెడల్‌ను విద్యార్థుల సమక్షంలో అందజేసి బాషాను ప్రిన్సిపాల్ సత్కరించారు. కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొని అవార్డు పొందిన బాషాకు అభినందనలు తెలిపారు.

### టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల, బడేజానీ

గురజాల: తెలుగుదేశం పార్టీకి చెందిన 25 మంది ముస్లీం మైనార్టీలు వైఎస్సార్ సీపీలోకి శనివారం రాత్రి చేరారు. వీరిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, నగర పంచాయతీ వైస్ చైర్మన్ షేక్ బడేజానీలు పార్టీ కండువాలు కప్పి సాదారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా యెనుముల మురళీధర్‌రెడ్డి, షేక్ బడేజానీలు మాట్లాడుతూ ముస్లీం మైనార్టీల అభ్యున్నతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. ముందుగా పట్టణంలో ద్విచక్రవాహనాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ఖాలేషా దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగురవేయాలని మొక్కు కున్నారు. ఈ కార్యక్రమంలో ముస్లీం మైనార్టీ నాయకుడు షేక్ నాగులుమీరా, మీర్‌సా, వలి, లత్తు, సుభానీ, తదితరులున్నారు.

### కులగణనపై క్యాబినెట్ తీర్మానం హర్షణీయం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ బీసీ నాయకులు

పిడుగురాళ్ల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యాబినెట్‌లో కులగణనపై తీర్మానం చేయడం హర్షణీయమని పిడుగురాళ్ల మార్కెట్ యార్డు చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కుందూర్తి గురవాచారి తెలిపారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో శనివారం పట్టణ వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కందులూరి శివయ్య అధ్యక్షతన బీసీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి కులగణనకై నిరీక్షిస్తున్న సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యాబినెట్‌లో తీర్మానం చేయడం మంచి నిర్ణయం అన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే బీసీ నాయకులకు నామినేటెడ్ పదవుల్లో అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీసీ నాయకులు ఎనుముల వెంకటేశ్వర్లు, కంభంపాటి కోటేశ్వరరావు, కొక్కెర శ్రీనివాసరావు, శెట్టుపల్లి పూర్ణ, నంద్యాల బాబు, ఉప్పు వెంకటేశ్వర్లు, తురక ముక్కంటి, ఇలూరి వెంకయ్య, నెమలికంటి సైదులు, మనకగోటి బ్రహ్మం, బత్తుల ఆంజనేయలు, కంభంపాటి వెంకటేశ్వర్లు, బీసీ నాయకులు పాల్గొన్నారు.

# హామీ పథకంతో గ్రామీణులకు ఉపాధి

**జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ గంగవరపు జోసఫ్‌కుమార్**

రెంటచింతల: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో పనులు లేని సమయంలో ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ గంగవరపు జోసఫ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాయలం నందు నిర్వహించిన బహిరంగ ప్రజావేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధి పనులలో అవినీతికి తావులేదన్నారు. పనులు చేయకుండా బిల్లులు మంజూరు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్షేత్రస్థాయి సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తే వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు వరకు గ్రామాలలో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులపై ఈ ప్రజావేదిక ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలోని 11 గ్రామాలలో 2022-23 సం. కాలంలో మొత్తం రూ. 4,37,91,410ల విలువైన 371 పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఈ ఏడాది అక్టోబర్ 28 నుంచి నవంబర్ 3 వరకు గ్రామాలలో చేసిన 371 ఉపాధి పనులను ఏపీ 15వ విడత సామాజిక తనిఖీలలో భాగంగా తనిఖీ బృందాలు పరిశీలించాయన్నారు. వారి నివేదికల ప్రకారం మొత్తం రూ. 23,943 రికవరీ చేయడానికి ఆదేశించినట్లు తెలిపారు. ఈ ప్రజావేదికలో ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, వైస్ ఎంపీపీ ఏరువ శౌరెడ్డి, ఎస్ఆర్పీ టి.వెంకటేశ్వర్లు, ఉపాధి పథకం ఏపీఓ జయచంద్ర కుమార్, డీఆర్పీఎస్ సభ్యులు, ఎఫ్ఏలు ఆర్.సామ్యానాయక్ తదితరులు పాల్గొనాలని ఆయన కోరారు.

### కన్యక చిత్రం షూటింగ్ పూర్తి

నకరికల్లు: వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రారంభించిన చిత్రం శనివారంతో పూర్తయినట్లు చిత్ర దర్శకుడు రాఘవ తిరువాయిపాటి తెలిపారు. ఆయన మాట్లాడుతూ మహిళలతో అమానుషంగా ప్రవర్తించేవారిని ఎవరు క్షమించినా అమ్మవారు క్షమించరనే అంశంపై కథ సాగుతుందన్నారు.